ప్రజాశక్తి

ఆదివారం 25 జూన్ 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





ఎల్ఐసి పరిరక్షణకు ఉధృత పోరాటం

◆ ఎఐఐఇఎ జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్

◆ విశాఖలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసిని కాపాడుకునేందుకు రానున్న కాలంలో ఉధృత పోరాటాలు నిర్వహించాలని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. విశాఖలోని ఎంవిపి కాలనీ సెక్టార్ - 5లో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసిఇయు) విశాఖపట్నం డివిజన్ నూతన భవన శంకుస్థాపన కార్యక్రమం శనివారం ఉదయం ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. వేణుగోపాల్, ఎస్‌సిజెడ్ఐఇఎఫ్ ప్రధాన కార్యదర్శి టివిఎన్ఎస్.రవీంద్రనాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొని శంకుస్థాపన చేశారు. అనంతరం ఐసిఇయు అధ్యక్షురాలు ఎం.కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎంవిపి కాలనీలోని గిరిజన్ భవన్‌లో సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాల్ మాట్లాడుతూ యూనియన్ భవనాలు కేవలం ఎల్ఐసి కార్యక్రమాలకు మాత్రమే కాకుండా ఇతర ట్రేడ్ యూనియన్ల సభలు, సమావేశాలు, అభ్యుదయకర కార్యక్రమాలకూ వేదికగా నిలవాలన్నారు. విశాఖలో తలపెట్టిన ఐసిఇయు భవనం 2024 చివరినాటికి పూర్తయ్యేలా చూడాలన్నారు. బహుముఖ సేవలకు ఈ భవనం ఆలవాలంగా నిలవాలన్నారు. భవన నిర్మాణానికి ఎల్ఐసి ఉద్యోగులంతా మిగతా 2లో..



భవన శంకుస్థాపన కార్యక్రమంలో వేణుగోపాల్ తదితరులు

కెజిహెచ్‌కు ఎంఆర్ఐ స్కానర్ కేటాయించాలి

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రికి ప్రజా ఆరోగ్య వేదిక లేఖ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రదాయని కెజిహెచ్‌కు ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రంతో పాటు తక్షణమే ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజా ఆరోగ్య వేదిక కోరింది. శనివారం ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినికి వేదిక అధ్యక్షులు డాక్టర్ ఎంవి.రమణయ్య, కార్యదర్శి టి.కామేశ్వరరావు లేఖ రాశారు. పేదలకు సంజీవినిలా ఉన్న కెజిహెచ్‌లో రోజు రోజుకూ వైద్య సేవలు క్షీణిస్తున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. పెద్దాస్పత్రిలో ఎంఆర్ఐ స్కాన్ పనిచేయడం లేదని, అధికారులు కూడా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని లేఖలో వేదిక ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. రోగుల అవసరాలు, డిమాండ్ మిగతా 2లో..



ధర్నా చేస్తున్న కార్మికులు, మద్దతుగా నిలిచిన రాజకీయ పార్టీల నేతలు

అదానీ గంగవరం పోర్టులో మహాధర్నా

విధులు బహిష్కరించిన కార్మికులు - దిగొచ్చిన యాజమాన్యం

వార్త మెయిన్‌లో..

జగనన్న సురక్షను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా ప్రత్యేకాధికారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మలతో కలిసి జగనన్న సురక్ష పథకం అమలుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చే ప్రతి అర్జీని జగనన్న సురక్ష ద్వారా పరిష్కారం చేయాలన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

▶ వార్త 7లో..

పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దుచేయాలి

▶ వార్త 4లో..

సమస్యలపై ఎమ్మెల్యేలకు మొర

▶ వార్త 8లో..

అధికా(కో)రిక యాత్రలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

కోరికకు ఆరాటం తప్ప ప్రామాణికత, ప్రమాణాలు, నైతికత వుండదు. ఆ కోరిక అధికారం కోసమైనా కావొచ్చు. ప్రమోషన్ కోసమైనా, ఓ అలంకార ప్రాయమైన కుర్చీ కోసమైనా, డబ్బు కోసమైనా అవ్వొచ్చు. వీటిచుట్టూ మనిషి తిరుగుతున్నంతకాలం, ఆలోచిస్తున్నంతకాలం వాస్తవాన్ని గ్రహించడానికి, వినడానికి, అర్థం చేసుకోవడానికి మనసెంతమాత్రం పెట్టడు. ఆ బుర్రను బురదలో వుంచి, ఆకాశానికి కాలుచూపుతూనే వుంటాడు. ఇపుడదేపని అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపి చేస్తున్నాయి. అధికారమనే కోరిక చుట్టూ జిల్లాను అలుముకున్న సమస్యలు వదిలి ఆ రెండు పార్టీలు వీధి యాత్రలు చేస్తున్నాయి. అధికార పార్టీ గడపగడపకు మన ప్రభుత్వం పేరుమీద మీటింగ్‌లు పెడుతోంది. మరోపక్క ఎంతో చరిత్రకల్గిన తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ అమ్మకానికి జరుగుతున్న అనైతిక నిర్ణయంపై పెద్దగా మాట్లాడ్డంలేదు. రైతు, కార్మిక సంఘాలు, సిపిఎం, వామపక్షాలు తప్ప మిగిలిన రాజకీయ పార్టీలు మాట్లాడ్డంలేదు. రైతుల ఆస్తిని అమ్మే హక్కు ప్రభుత్వానికి ఎవరిచ్చారని ప్రశ్నించడంలేదు. ఫ్యాక్టరీని ఆధునీకరించి క్రషింగ్‌ను పునరుద్ధరించాలని రైతులు డిమాండ్‌ను పట్టించుకోకుండా అమ్మకానికి పెట్టడం అన్యాయమే. తొలుత చరాస్తుల విలువ కట్టి అమ్మినా, తరువాత రూ.500 కోట్ల విలువైన స్థిరాస్తులను ముక్కలుచేసి అమ్మకానికి ఈ ప్రభుత్వం వెనుకాడేలాలేదు.



తుమ్మపాలను అమ్మకానికి పెట్టాలన్న ప్రభుత్వ తప్పుడు నిర్ణయాన్ని ప్రశ్నించే ధైర్యం టిడిపికి లేదు. ఎందుకంటే దానికాలంలో ఈ నిర్ణయాలు పురుడుపోసుకున్నాయి. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టాలన్న ఆలోచనలో టిడిపి, వైసిపికి రెండో అభిప్రాయంలేదు. సుగర్ ఫ్యాక్టరీని తెగనమ్మడానికి టిడిపి ప్రయత్నించినట్లే, ఇప్పుడు వైసిపి ప్రయత్నిస్తోంది. ఫ్యాక్టరీ అమ్మకంపై విమర్శ తప్ప దాన్ని కాపాడుకోవాలన్న మాట టిడిపి నోట రావడంలేదు. టిడిపి విమర్శపై ఎదురుదాడి తప్ప సుగర్ ఫ్యాక్టరీని అమ్మనీయకుండా ఒప్పిస్తామని మంత్రి అమర్‌నాథ్ మిగతా 2లో..



మొదటి పేజీ తరువాయి..

ఎల్ఐసి పరిరక్షణకు ఉధృత పోరాటం

విరాళాలు అందించాలని కోరారు. ప్రస్తుతం రూ.43 లక్షల కోట్ల ఆస్తులను ఎల్ఐసి కలిగి ఉందని, పబ్లిక్ సెక్టార్‌లో గవర్నమెంట్ సెక్టార్ షేర్లు పెరగకుండా ప్రైవేట్ వ్యక్తులు అడ్డుకుంటున్నారని తెలియజేశారు. అదానీ కుంభకోణంపై ప్రభుత్వం స్పందించకపోగా ఎల్ఐసిని నిర్వీర్యపరిచేందుకు కుట్రలు చేస్తోందన్నారు. మరొక ముఖ్య అతిథి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఐసిఇయు విశాఖపట్నం డివిజన్ దేశంలోనే ఎంత ఖ్యాతి పొందిన యూనియన్ అని కొనియాడారు. నూతన భవనం భవిష్యత్తులో ఉద్యమ కేంద్రంగా మారాలని ఆకాంక్షించారు. ఎల్ఐసి ప్రయివేటీకరణకు జరుగుతున్న కుట్రలను వివరించారు. భవిష్యత్తులో ట్రేడ్ యూనియన్లపై మరిన్ని దాడులు జరగనున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ఎల్ఐసిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. ఐసిఇయు నూతన భవనం ఎంవిపి ప్రాంతంలో ఉన్న లక్ష మంది ఉద్యోగులు, పెన్షనర్లు, అసంఘటిత కార్మికులకు వేదిక కావాలని ఆకాంక్షించారు. సాధారణ గృహాల మధ్య ఈ భవన నిర్మాణం తలపెట్టారని, రానున్న కాలంలో ప్రజలందరితో మమేకమై ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, ఎల్ఐసి క్లాస్ 1 అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వెంకటరావు, ఎన్ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యుఐ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్, ఎల్ఐసి ఎఒఐ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ ఠాగూర్, ఎల్ఐఎఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఎల్ఐసి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు జి.విజయకుమార్, ఎల్ఐసి ఒబిసి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరినాథ్ కుమార్, ఐసిఆర్ఇఎ ప్రధాన కార్యదర్శి ఆర్.పాండురంగడు, అధ్యక్షులు కె.మోహన్‌రావుతోపాటు ఎల్ఐసి పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు, నిర్మాణదారుడు రెడ్డి వెంకటేశ్వరరావు, ఉమెన్ కన్వీనర్ జి.సూర్యప్రభ, ఎల్ఐసి అనుబంధ అసోసియేషన్ల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అధికా(కో)రిక యాత్రలు

మాట్లాడలేకపోతున్నారు. భవిష్యత్‌కు గ్యారంటీ పేరుతో పాయకరావుపేట నుంచి టిడిపి ప్రారంభించిన బస్సు యాత్ర టిడిపి భవిష్యత్ గురించి తప్ప ప్రజల భవిష్యత్ గురించి సాగడంలేదు. అధికారం కోసం తప్ప ప్రజా సమస్యలు వీరికి పట్టడంలేదు. నిజానికి ఈ సమస్యలన్నింటికీ తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు ఈ పాపంలో ఇరు పార్టీలకు భాగస్వామ్యం వుంది కాబట్టే వ్యక్తిగత విమర్శలు, ఆరోపణలపై పెడుతున్న దృష్టి ప్రధాన సమస్యలపై పెట్టడంలేదు. పరిశ్రమలను ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వూరూవాడావెళ్లి చెబుతున్న ప్రభుత్వం ఆ దిశగా ఒక్క చర్యా చేపట్టలేదు. ఇంతవరకూలేని డిమాండ్ ఛార్జీలు ఫెర్రో ఎల్లాయీస్ కంపెనీలకు వర్తించడంతో అవి మనగలకలేక మూసివేతకు సిద్ధపడుతున్నాయి. అనాలోచిత విధాన నిర్ణయాలు ఎన్ని వేల మంది కార్మికులను వీధులపాల్జేస్తాయో కూడా ఈ ప్రభుత్వం గుర్తించినట్లులేదు. డిమాండ్ ఛార్జీలు, ఎలక్ట్రికల్ డ్యూటీ విధించడం వల్ల విద్యుత్ ఛార్జీలు భారం భరించలేక సరోజిని ఫెర్రో ఎల్లాయీస్ మూతపడింది. అభిజిత్, సుందరం, రాజరాజేశ్వరి, మెథాన్ పరిశ్రమలు మూతదిశగా అడుగులు వేస్తున్నాయి. ఆ పరిస్థితి రాకముందే జిల్లాకు చెందిన పరిశ్రమల మంత్రి అమర్‌నాథ్ స్పందించాలి. పరిశ్రమలు నడవగలిగేలా విద్యుత్ రాయితీ ఇవ్వాలి. కార్మికుల ఉపాధి దెబ్బతినకుండా చూడాలి.

కెజిహెచ్‌కు ఎంఆర్ఐ స్కానర్ కేటాయించాలి

మేరకు మౌలిక సదుపాయాలను మెరుగు పర్చాలని విజ్ఞప్తి చేశారు. అందుకోసం అదనపు నిధులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో మృతిచెందిన

కార్మికుని కుటుంబానికి న్యాయం కోసం ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి ఎలక్ట్రికల్ విభాగంలో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తూ విద్యుదాఘాతంతో మృతిచెందిన పిట్ల సూర్రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, నాయకులు రమణ మాట్లాడుతూ సూర్రెడ్డి తొమ్మిది సంవత్సరాలుగా జివిఎంసి ఎలక్ట్రికల్ విభాగంలో కాంట్రాక్ట్ కార్మికునిగా పనిచేస్తున్నారని చెప్పారు. శనివారం మాధవధార వద్ద ఎలక్ట్రికల్ పని చేస్తుండగా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడని చెప్పారు. అతనికి ఎటువంటి రక్షణ పరికరాలనూ కాంట్రాక్టర్‌గానీ, జివిఎంసిగానీ సమకూర్చకపోవడం కూడా ఈ ప్రమాదానికి కారణమని చెప్పారు. కాగా సూర్రెడ్డి మృతదేహాన్ని వైద్య పరీక్షల నిమిత్తం కెజిహెచ్‌కు తరలించగా అక్కడా కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.



ధర్నా చేస్తున్న జివిఎంసి కార్మికులు, సిఐటియు నాయకులు

ముందుగా కెజిహెచ్ వద్దకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి అతని కుటుంబ సభ్యులను యూనియన్ నాయకులు ఓదార్చారు. అక్కడ నుంచి కార్మికులు రాత్రి 8 గంటల ప్రాంతంలో జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, అతని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, కుటుంబానికి ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూర్రెడ్డి మరణానికి పూర్తి బాధ్యత కాంట్రాక్టర్ వహించాలన్నారు. ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా జివిఎంసి కూడా బాధ్యత వహించాలన్నారు. తాము కోరిన మేరకు డిమాండ్లను అంగీకరించాలని, లేకుంటే ఆదివారం జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. జివిఎంసి అధికారులు యూనియన్ నాయకులతో చర్చలు నిర్వహిస్తున్నారు.

ముగిసిన ఎల్ఐసి డివిజనల్ స్థాయి క్రీడలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎల్ఐసి డివిజనల్ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ అథ్లెటిక్ మీట్ క్రీడలు శనివారం రైల్వే స్టేడియంలో ముగిశాయి. ముఖ్య అతిథిగా ఎల్ఐసి పర్సనల్ మేనేజర్ భగవాన్ ప్రసాద్ హాజరై విజేతలకు ఆగస్టులో కర్ణాటకలోని ఉడిపిలో జరగనున్న జోనల్ స్థాయి క్రీడలకు ఎంపికైన వారికి నగదు పురస్కారాలు అందించారు. ఈ రోజు ముగిసిన పోటీల్లో షటిల్ టోర్నమెంట్ విజేతలుగా మొదటి స్థానంలో ఎల్.సురేంద్ర, రెండో స్థానంలో బి.సురేంద్ర, మూడో స్థానంలో ఉదయ్ సాగర్ నిలవగా, మహిళల విభాగంలో మొదటి స్థానంలో శ్రీలత వర్మ నిలిచి జోనల్ మీట్‌కు అర్హత సాధించారు. అథ్లెటిక్స్ విబాగంలో విజేతలుగా రేవంత్ (100 మీటర్లు), ప్రశాంత్ (200 మీటర్లు), గౌతమ్ (400 మీటర్లు), దివాకర్ (800 మీటర్లు), కిరణ్ (1500 మీటర్లు) నిలిచారు. రాజ్ కిరణ్ (షాట్‌పుట్), రాజా గణపతి (లాంగ్ జంప్), పార్థసారధి (హైజంప్) విభాగాల్లో అర్హత సాధించారు. వాలీ బాల్ జోనల్ మీట్‌కు రాకేష్ వర్మ, ప్రవీణ్, హరిగోపాల్, నూకేశ్వరరావు అర్హత పొందారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి స్పోర్ట్స్ ప్రమోషనల్ బోర్డు సభ్యులు డివిఎస్‌వై.శర్మ, ఎల్ఐసి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శంకర్ నారాయణ, క్లబ్ సెక్రటరీ బి.శ్రీనివాస్ సెలెక్టర్లు వివిఎస్ శాస్త్రి, వెంకటకుమార్, సిహెచ్.సింహాచలం పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగంతోనే దేశ ప్రగతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశ ప్రగతి ప్రభుత్వ రంగ సంస్థలతోనే సాధ్యమవుతుందని సిఐఎఫ్‌టియుఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.లక్ష్మి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు శనివారానికి 814వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐఎఫ్‌టియుఐ మత్స్యకార మహిళలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

'పద్ధతి ప్రకారమే బిల్లులు'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విద్యుత్ వినియోగదారులందరికీ బిల్లులు ఎప్పటికప్పుడు ఎపిఇఆర్‌సి గెజిట్ నోటిఫికేషన్ ప్రకారమే జారీ చేస్తున్నట్టు ఎపిఇపిడిసిఎల్ అధికారులు తెలిపారు. ఈ నెల 24న 'ప్రజాశక్తి'లో వచ్చిన 'అప్పుడు వాడితే ఇప్పుడు షాక్' కథనానికి వారు స్పందించారు. జోన్ 1లోని కెఆర్ఎం కాలనీ, మద్దిలపాలెం ప్రాంతాలకు సంబంధించిన బిల్లులపై వివరణ ఇచ్చారు. సదరు వార్తలో పేర్కొన్న వినియోగదారులు ఇండ్ల హేమలత, ఆగ్రహం వ్యక్తం చేసిన జర్రా కొండమ్మల వివరాలు తమ వద్ద ఉన్న వినియోగదారుల జాబితాలో లేవని తెలిపారు. ఈ అదనపు బిల్లులకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులూ తమకు అందలేదని పేర్కొన్నారు.

మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా జడ్జి
వారి కోర్టులో : విశాఖపట్నం
M.O.P. 1027 / 2022

బిట్వీన్:
దొమ్మేటి శ్రీనివాసరావు . . . పిటీషనరు
అండ్:
ఎల్.సురేష్ @ అనదర్ ... రెస్పాండెంట్లు

నోటీసు

టు:
రెస్పాండెంటు నెం.1:
లింగాల సురేష్, తండ్రి సోములు,
నివాసం : డో.నెం. 5-55,
వేములవలస ఆనందపురం మండలం,
విశాఖపట్నం జిల్లా.

పై నెంబరు కేసులో వాది నష్టపరిహారం రాబట్టుటకోరి క్లయిము పిటిషను వేసియున్నారు. కాగా కోర్టు వారు పై కేసులో **తేది: 14-07-2023**కు మీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కావున పైన చెప్పిన తేదిలో **ఉదయం 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని, వకీలుగారి ద్వారా గాని పైన చెప్పబడిన కోర్టులో హాజరుకావలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

(By Order)
P.LAKSHMANA RAO
Advocate, Visakhapatnam.
Cell : 9440633565

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT: GAJUWAKA
O.S.378/2022

Between :
CANARA BANK, Kurmannapalem Branch,
Visakhapatnam, Rep. by its Manager ...Plaintiff
And
M/s. Padmavathi Garments,
Rep. by its Prop:
Sri Patnala Nookachari & Another ...Defendants

SUMMONS

To,
D-1: M/s. Padmavathi Garments,
Rep. by its Prop: Sri Patnala Nookachari, D.No. 4-133, Dibbapalem, Ramalayam Daggara, Tummapala, Visakhapatnam-531032.
D-2: Sri Patnala Nookachari,
S/o. Patnala Narasingarao, R/at D.No. 4-133, Dibbapalem, Ramalayam Daggara, Tummapala, Visakhapatnam-531032.

Take notice that, the above named plaintiff instituted the above suit against you under Order VII Rule (1) read with section 26 of Civil Procedure Code for suit claim. You are hereby summoned to appear in the above Court in person or by Pleader duly instructed and able to answer all material questions relating to the above suit on the day **14-07-2023** at **10:30 A.M**. Take notice that in default of your appearance on that day and hour, the suit will be heard and determined in your absence basing on the material available in the Court.

G.V.S. PURUSHOTHAMA RAO,
Advocate, Visakhapatnam.
Cell :8197845400.

IN THE HON'BLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT: PITHAPURAM
E.P.4/2023 in O.S.113/2018

Between:
N. Sarveswara Reddy ...D.Hr/Plaintiff
And:
Y. Suri Babu and another ...J.Dr's/Defendants

NOTICE

To,
JDR No.1 :
Yannamreddy Suribabu @ Surya Rao, S/o. Paidayya Reddy, Hindu, 65 years, R/at.D.No. 3-6, Ravikamatham Village, Ravikamatham Mandalam, Anakapalli District.
JDR No.2 :
Yannamreddy Taraka Venkata Kishore Reddy, S/o. Suribabu @ Surya Rao, Hindu, 38 years, Rest-do-

Please take notice that the above named D.Hr/Plaintiff has instituted the above case against you for execution of decree passed in O.S.113/2018 and the matter stands posted to **19-07-2023** for your appearance. Therefore, You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **19-07-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
B. LAXMANA DORA, Advocate
Pithapuram, Cell: 98481 84474

జనరల్ పబ్లిక్ నోటీస్

ఇందుమూలంగా యావన్మందికి తెలియ జేయునది ఏమనగా మా క్లయింట్స్ అయినటువంటి కటారి అనురాధ మరియు కటారి శ్రీదేవి D/o. కటారి సూర్యనారాయణరాజు (లేటు), పాత ఐ.టి.ఐ.జంక్షన్ వాస్తవ్యులు భోగట్టా ప్రకారం వారి తండ్రిగారైన కటారి సూర్యనారాయణరాజు గారి స్వర్జీతపు ఈ దిగువ షెడ్యూల్ ఆస్థిని మా క్లయింట్స్ అన్నయ్యగారైన శ్రీ కటారి రమేష్ చంద్రరాజుగారు మాక్లయింట్స్ తండ్రిగారి ప్రమేయము లేకుండా ఈ దిగువ షెడ్యూల్ ఆస్థిని సెటిల్‌మెంట్ దస్తావేజు నెం. 6953/2020 రూపంలో పొంది ఈ ఆస్థిని వేరే వారికి మా క్లయింట్స్ యొక్క వారసత్వ హక్కుని చూపించకుండా అమ్ముటకు ప్రయత్నము చేయుచున్నారని తెలిసి ఈ పబ్లిక్ నోటీస్ ఇచ్చుచున్నాము. కావున ఈ దిగువ తెలియ జేసిన షెడ్యూల్ ఆస్థిపై శ్రీ కటారి రమేష్ చంద్రరాజు గారి వద్ద ఎటువంటి ఆర్థిక పరమైన లావాదేవిలు జరపవద్దని అట్లు జరిపిన ఈ దిగువ షెడ్యూల్ ఆస్థిలో ఎటువంటి హక్కు పొందజాలరని ఈ పబ్లిక్ నోటీస్ ద్వారా మా క్లయింట్స్ తెలియజేయుచున్నారు.

షెడ్యూల్ ఆస్థి వివరములు

SRO విశాఖపట్నం జివియంసి ఏరియాలో చేరినటువంటి, వాల్తేరు వార్డు బ్లాక్ నెం. 23, T/s No. 379, ఈస్టుపాయింట్ కాలనీ దాఖలా ప్లాట్‌నెం.6లో 400 చ॥గ॥ విస్తీర్ణం గల స్థలమున్నూ అందలి డో.నెం. 6-18-4 గా గల్గిన ఆర్.సి.సి. డాబాయిల్లు సహిత ఆస్థికి హద్దులు:
తూర్పు: ప్లాట్‌నెం. 7రు గల పి.రామక్రిష్ణగారి యిల్లు
దక్షిణం: ప్లాట్‌నెం. 18
పడమర: ప్లాట్‌నెం. 5రు గల ఎం.పి.రాజుగారి యిల్లు
ఉత్తరం : 40 అడుగుల వెడల్పు గల రోడ్డు.

GOWRI SANKAR SARAPATI
KAMESWARA RAO REDDDY
Advocates,D.No. 2-130,
Opp. Gopalapatnam Police Station,
Baji Jn., VSP-27.
Cell : 784280006, 9966049232

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT : BHEEMUNIPATNAM
E.P.No. 25/2021 in Dispute No. 237 / 2013

Between:
M/s. Margadarsi Chit Fund (P) Ltd.,
Rep. by its Branch Manager,
Dabagardens, Visakhapatnam . . . Decree Holder
And:
Y.Eswara Rao and others . . . Judgement Debtors

PROCLAMATION OF SALE

Notice is hereby given that by on order of the court named above, the property of 6th Judgment debtor by name Utti Venkata Durga Bhavani,D/o. Sri. Chiranjeevi Rao, in the schedule hereunder has been ordered to be sold by public auction in satisfaction of the claim of the decree holder mentioned in the above execution petition for a sum or Rs.25,73,675/- (excluding publication charges and battas) up to date of sale in the aforesaid dispute against the 6th judgment debtor mentioned above.

Public are hereby informed that the sale will be held between **10-30 AM to 5 PM on 17-07-2023** at public court i.e., Honourable Prinicipal Junior Civil Judge, Bheemunipatnam.

At the sale the public are generally intend to bid either personally or by duly authorized agent subject to terms and conditions to sale which may be had from the counsel for the Decree Holder whose address particulars are furnished herewith.

SCHEDULE PROPERTY

All that site measuring an extent of 27 square yards being an undivided and unspecified share out of total extent of 867 square yards together with residential flat no. 204, with a plinth area of 980 sft (including common areas and balconies) in the first floor of "Sai Simhadri Enclave" in plot nos. 32, 33 and 34 approved by VUDA Vide L.P.No. 11/86 of RC No. P-11 situated at Saramasakthi Nagar, Covered by S.No. 81/2 to 5, 8 to 14 & 87/1 and 2 of Chinamushidivada Village, within limits of Greater Visakhapatnam Municipal Corporation are and registration vide Doc No. 2133/2009 dated 14-09-2009 of Sub-Registrar of Pendurthy, Visakha patnam and bounded as follows:

Total Apartment Building Boundaries
East : Plot No.s 27, 28 and 29
West : 40 feet road
South : Plot No. 31
North : Plot No. 35
Boundaries of Residential Flat No. 204
East : Common corridor after that Flat No. 203
South : Lift and Flat No. 206
West : Open Space
North : Flat No. 202
Measurement of Flat No. 204
Extent built about 980 Sft inculding common areas and balconies
Property worth : Rs. 24,50,000/-
Decree Holder Value: Rs.13,00,000/-
Ameen Value : Rs. 22,00,000/-
Value of 6th Judgment Debtor did not furnish the same.

PPS ASSOCIATES
Y.SUJATHA, P.MURALI GOPAL
J.V.PREMA SAI Advocates
D.No. 49-19-20, Lalithanagar,
Visakhapatnam-16. **Cell: 9701862649, 9848320248 9848695558**

టౌన్‌షిప్ పేరిట మామిడి తోట తొలగింపు

గ్రామస్తుల అడ్డగింత

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం పాలవలస గ్రామంలో జివిటి స్మార్ట్ టౌన్‌షిప్ పేరిట శనివారం రెవెన్యూ అధికారులు అక్రమంగా మామిడి తోటలను తొలగించడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. పాలవలస రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 80/3లోని సుమారు 30 ఎకరాల్లో 30 మంది రైతులు మామిడి తోటలు వేసుకుని సాగు చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో జివిటి స్మార్ట్ టౌన్‌షిప్ కోసం ప్రభుత్వం స్థల సేకరణకు సిద్ధమైంది. దీన్ని రైతులు వ్యతిరేకించారు.

ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం రెవెన్యూ అధికారులు ప్రోక్లైనర్‌తో వెళ్లి పాలవలస అప్పలకొండ కుమారుడు శంకర్‌కు చెందిన ఎకరా భూమిలోని మామిడి తోటలను తొలగించారు. దీంతో రైతులందరూ సంఘటనా స్థలానికి చేరుకొని కోర్టులో కేసు ఉండగా అక్రమంగా స్వాధీనం చేసుకోవడం తగదని రెవెన్యూ అధికారులను నిలదీశారు. తాము ల్యాండ్ పూలింగ్ పేరిట భూములు ఇవ్వబోమని పాలవలస శంకర్ స్పష్టంచేశారు. దీనిపై తహశీల్దార్‌ను ప్రజాశక్తి రైతుల ఇష్టంతోనే ల్యాండ్ పూలింగ్ చేపట్టామని, దరఖాస్తులు తీసుకున్న తర్వాతనే సంబంధిత భూముల్లోకి వెళ్లామని చెబుతున్నారు. ఈ చెట్లు తొలగించిన స్థలానికి సంబంధించి కోర్టులో ఎటువంటి కేసూ లేదని తహశీల్దార్ రామారావు చెప్పారు.



మామిడి తోట తొలగింపును అడ్డుకుంటూ బైఠాయించిన రైతులు

సంపద తయారీ కేంద్రం రేకులు చోరీ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ పరిధిలో ఉన్న సంపద తయారీ కేంద్రం (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డు) పై కప్పు రేకులను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీ చేశారని పంచాయతీ కార్యదర్శి కీర్తి ప్రసాద్ శనివారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంత కాలంగా ఇది నిరుపయోగంగా ఉంది. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని, సంపద తయారీ కేంద్రాన్ని వాడుకలోకి తేవాలని టిడిపి మండల అధ్యక్షులు డిఎన్ రాజు సంబంధిత అధికారులను కోరారు.

పిఎంఎవై లబ్ధిదారుల సంబరాలు

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా అర్బన్ హౌసింగ్ ప్రారంభించి ఎనిమిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆనందపురం పంచాయతీలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ టి.లోకనాథం, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జి.రమ్య, వైసిపి నాయకులు చందక సూరిబాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జగన్నాథస్వామికి దేవస్థానం నుంచి వస్త్రాలు, పూలు సమర్పణ

ప్రజాశక్తి-సింహాచలం: నరసింహ అవతారంలో ఉన్న విశాఖ నగరంలోని జగన్నాథ స్వామికి సింహాచల దేవస్థానం తరపున ఎఇఒ భ్రమరాంబ, సూపరింటెండెంట్లు సునీల్, నరసింహారావు శనివారం పట్టువస్త్రాలు, పండ్లు, పూలు, ఇతర సామాగ్రిని అందజేశారు.



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు పరిధి గాంధీనగర్‌లో జివిఎంసి నిధులు రూ.22 లక్షల వ్యయంతో సిసి రోడ్డు, కాలువలకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరిలోవ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఇప్పటికే ఈ ప్రాంతంలో కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆరిలోవ ప్రాంతంలో రైతు బజార్ త్వరలో అందుబాటులోకి రానుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి వర్క్స్ ఎఇ అప్పాజీ, వైసిపి నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషిచేయాలని తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల కోరారు. 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యాన ఆరిలోవ కాలనీలోని ఆరవ నెంబరు సచివాలయం పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి స్థానికులకు వివరించారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో మంచినీటి సమస్య, పందుల బెడద ఎక్కువగా ఉందని అక్కరమాని విజయనిర్మల దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఆమె వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా పారిశుధ్యంపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

జూ పార్కులో పెద్ద పులి మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో జానకి పేరుగల 22 ఏళ్ల పెద్ద పులి అనారోగ్యంతో శనివారం మృతి చెందినట్లు జూ క్యూరేటర్ డాక్టర్ నందినీసలారియా తెలిపారు. వృద్ధాప్యం, గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్న పెద్ద పులికి జూ వైద్య బృందం వైద్యం అందిస్తోందని పేర్కొన్నారు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో శనివారం మృతి చెందినట్లు తెలిపారు.

ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి -పద్మనాభం : అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండల ఎంపిడిఒ ఎం.ఉషారాణిని పద్మనాభం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎంపిపి రాంబాబు ఆధ్వర్యాన సన్మానించారు. పద్మనాభంలో కొంతకాలం ఇఒపిఆర్‌డిగా పనిచేసిన ఉషారాణి ఎంపిడిఒగా ప్రమోషన్‌పై డుంబ్రిగుడ మండలానికి బదిలీపై వెళ్లారు.

టైలరింగ్‌తో మహిళలకు ఉపాధి

ప్రజాశక్తి - ఆరిలోవ : టైలరింగ్ వృత్తితో మహిళలు ఉపాధి అవకాశాలు పొందవచ్చని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. పెదగదిలి ప్రాంతం ప్రజలకు టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, టైలరింగ్ శిక్షణలో పలు రకాల మోడల్స్‌లో మెళకువలు నేర్చుకుంటే మహిళలకు ఇంటి వద్దే ఉండి ఉపాధి పొందవచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఆనందపురం : విద్యుత్ లైన్లలో మరమ్మతు పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఎఇ సురేష్ కుమార్ తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బోని రోడ్డు, ఆనందపురం, ఎల్‌వి.పాలెం తదితర ప్రాంతాల్లోని గృహ, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అన్నప్రసాదానికి రూ1,01,116 విరాళం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న నిత్యాన్న ప్రసాద వితరణకు మద్దిలపాలెం హెచ్‌బి కాలనీకి చెందిన రామారావు, లక్ష్మి దంపతులు రూ.1,01,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. విరాళ దాతకు ఆలయ సిబ్బంది స్వామి దర్శనాన్ని కల్పించారు. అనంతరం ప్రసాదాన్ని, నగదు మొత్తానికి బాండును ఆలయ సూపరింటెండెంట్ సునీల్ వర్మ అందజేశారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

సిడిఎంఎ జిల్లా ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్య శాఖ సిబ్బందిని సిడిఎంఎ జిల్లా ప్రత్యేకాధికారి పి.కోటేశ్వరరావు ఆదేశించారు. 10వ వార్డు పరిధి రవీంద్రనగర్‌లోని సుందర్‌నగర్‌లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మతో కలిసి శనివారం ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో మౌలిక వసతుల గురించి డిఎంహెచ్‌ఒను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి రోజుకు ఎంత మంది రోగులు వస్తున్నారు.. పడకలు ఎన్ని ఉన్నాయి.. మందులు, చికిత్స వివరాలు.. ఎంత మంది వైద్యులు, ఇతర ఉద్యోగులు ఉన్నారో తదితర వివరాలనడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో తాగు నీటి కోసం ఆర్ఒ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

పిఆర్‌ఎస్‌ఐ జాతీయ కార్యదర్శిగా మూర్తి ఎన్నికపై హర్షం

ప్రజాశక్తి-విశాఖపట్నం : భారత ప్రజా సంబంధాల సంఘం (పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా) జాతీయ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పివిఎల్‌కె.మూర్తి ఎన్నిక పట్ల పిఆర్‌ఎస్‌ఐ విశాఖ కార్యవర్గం హర్షం వ్యక్తం చేసింది. న్యూఢిల్లీలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్‌లో శనివారం జరిగిన ఎన్నికలలో పివిఎల్‌కె.మూర్తి ఎన్నికను ఎన్నికల అధికారి శుభాష్ సూద్ ప్రకటించారని పేర్కొంది. జాతీయ అధ్యక్షునిగా డాక్టర్ అజిత్ పాఠక్, దక్షిణ భారత విభాగానికి విశాఖకు చెందిన హెచ్‌పిసిఎల్ విశ్రాంత అధికారి యుఎస్.శర్మ ఎన్నికయ్యారని తెలిపింది.

జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ పివిఎల్‌కె.మూర్తి పిఆర్‌ఎస్‌ఐ విశాఖ శాఖ చైర్మన్‌గా, కార్యదర్శిగా సేవలందించారు. రోటరీ క్లబ్ సేవా సంస్థల్లో కీలక పదవులు అలంకరించారు. స్వచ్ఛభారత్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు.

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎంచుకున్న లక్ష్యం ఉన్నతంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల చైర్పన్ కేసలి అప్పారావు విద్యార్థులకు స్పష్టం చేశారు. స్థానిక నేరెళ్లవలస కాలనీలోని ఎస్‌ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో శనివారం ఎస్‌ఎస్‌ఎస్ డేనిర్వహించారు. బాలలకు అన్ని విధాలా అండగా ఉంటూ ఉన్నత జీవితాన్ని, చదువును అందిస్తున్న ఎస్ఒఎస్ సంస్థ నిర్వాహకులను అభినందించారు. విశాఖ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ ఎంఆర్ఎల్ రాధ మాట్లాడుతూ, ఆర్థిక, సామాజిక కారణాల వల్ల ఎంతో మంది తల్లి దండ్రులు తమ పిల్లలను చదివించుకోలేని పరిస్థితులు ఉన్నాయని, అటువంటి పిల్లలకు చేయూత ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. తొలుత ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ వ్యవస్థాపకులు హెర్మన్ మైనర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. విలేజ్ డైరెక్టర్ కె.రవీంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఎస్‌సిపిసిఆర్ సభ్యులు గొండు సీతారాం, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు



'రీ సర్వే' పనులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

రీ సర్వేను పర్యవేక్షించిన జెసి విశ్వనాథన్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం పొడుగుపాలెం గ్రామంలో శనివారం చేపట్టిన రీసర్వే పనులను విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.విశ్వనాథన్, మండల తహశీల్దార్ లోకవరపు రామారావు పర్యవేక్షించారు. రెవెన్యూ సిబ్బందితో, రైతులతో జెసి మాట్లాడుతూ, ప్రతి రైతూ తమ భూములను రీసర్వే చేయించుకోవాలని, సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిటి శ్రీనివాసరావు, విఆర్ఒ అప్పలరాజు, సర్వేయర్, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దుచేయాలి

ప్రజాశక్తి -మధురవాడ : పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు రద్దుచెయ్యాలని, స్మార్ట్ మీటర్లు పెట్టాలన్న ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం సిపిఐ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు టిడిపి, సిపిఐ, సిపిఎం ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు పిళ్ల వెంకటరావు, గొల్లంగి ఆనందబాబు, దాసరి శ్రీనివాస్, కానూరి అచ్యుతరావు, సిపిఎం నాయకులు రాజ్‌కుమార్, ఎమ్‌డి బేగం, భారతి తదితరులు మాట్లాడుతూ, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన 2020 విద్యుత్ సంస్కరణలను బిజెపి పాలిత రాష్ట్రాలు కన్నా జగన్మోహన్‌రెడ్డి ముందుగా అమలుచేస్తున్నారని విమర్శించారు. గడిచిన నాలుగేళ్లలో రూ.50 వేల కోట్ల భారం వేశారని, ఇప్పుడు మరో రూ.17 వేల కోట్లును స్మార్ట్ మీటర్లు పేరుతో వడ్డిస్తున్నారని తెలిపారు.

ఇప్పటికే వేసిన చెత్త సేకరణ పన్ను, ఆస్తి మూలధన విలువ పన్ను, నీటి పన్నులు, పెరిగిన నిత్యవసరాల ధరలతో జీవనం సాగించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ సమయంలో ప్రజల నడ్డి విరిచేలా పెద్ద ఎత్తున విద్యుత్ ఛార్జీలు పెంచడం దుర్మార్గం అన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఎన్‌ఎసి సమావేశంతో 'ఆల్ పెన్షనర్స్'కు సంబంధం లేదు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

ప్రజాశక్తి -గాజువాక : నేషనల్ యాజిటేషన్ కమిటీ ఆధ్వర్యాన పెదగంట్యాడ ఉడా కాలనీలో ఏర్పాటుచేస్తున్న సమావేశానికి ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్‌కు ఎటువంటి సంబంధమూ లేదని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా కమిటీ అధ్యక్షులు కె.దీనబందు తెలిపారు. గాజువాక సిఐటియు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ అనుమతి లేకుండా వారు కరపత్రంలో తన పేరును ముద్రించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గతంలో ఢిల్లీలో పార్లమెంటు ముందు చేపట్టిన ధర్నాకు వారికి ఆహ్వానం పలికినప్పటికీ తిరస్కరించారని గుర్తు చేశారు. అయినప్పటికీ కలిసి వచ్చిన వారితో కలవటానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపారు. కానీ వారు బెంగళూరు నుంచి ప్రచార సమావేశాలు జరుపుకున్నారని, తమ ఆల్ ఇండియా కో-ఆర్డినేషన్ కమిటీని కలుపుకొని వెళ్లడం లేదన్నారు. ప్రధాన కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతూ, పోరాటాల ద్వారానే హక్కుల సాధించుకోగలం తప్ప ఈ విధంగా సభలు పెట్టడం కాదు అని స్పష్టంచేశారు. తమ పోరాట ఫలితంగా అనేక హక్కులు సాధించుకున్నామన్నారు. తమ సంఘం ఏ సంఘానికి అనుబంధం కాదని స్వతంత్ర సంఘం అని తెలిపారు. ప్రతి నెల మీటింగ్ ఏర్పాటుచేసుకొని అనేక విషయాలు చర్చించుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు యువిఎస్.వర్మ, కెపి.కుమార్, కె.కిరీటం, కెవి.రమణ, పి గురునాథరావు, కణితి అప్పలరాజు, డి వెంకట్రావు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే పరిశీలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- యంత్రాంగం :

తగరపువలస : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని, అందుకు అనుగుణంగా గృహసారథులు, వార్డు వాలంటీర్లు పనిచేయాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమం అమలులో భాగంగా జివిఎంసి 1, 2, 3 వార్డుల పరిధిలో ఉన్న గృహ సారథులు, వాలంటీర్లతో చిట్టి వలస ఫుట్ బాల్ గ్రౌండ్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అర్హత ఉండి కూడా అందకుంటే కారణాలు తెలుసుకొని, వారికి పథకాలు అందేలా చూడాలని సూచించారు. మాజీ మంత్రి, నియోజకవర్గ పరిశీలకులు పి.బాలరాజు మాట్లాడుతూ, అన్ని తరగతుల ప్రజలకు మేలు జరగాలన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా మనమంతా కలిసి పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ బొడ్డేపల్లి రాము, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు కె.ప్రభావతి, ఆయా వార్డుల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి సమస్యనూ పరిష్కరించాలి

పెందుర్తి: గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఉన్న సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు సూచించారు. జివిఎంసి 97వ వార్డు పరిధి సుజాతనగర్ ఆర్‌కె.ఫంక్షన్ హాల్‌లో జగనన్న సురక్ష శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, మండలస్థాయి సిబ్బంది, అధికారులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి గ్రామానికీ ఒక రోజు కేటాయిస్తూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటినీ జల్లెడ పడుతూ సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి, సబ్బవరం మండల జెడ్‌పిటిసి సభ్యులు తుంపాల అప్పారావు, ఉప్పిలి దేవి, ఎంపిపిలు బొంకం రామునాయిడు, మదుపాడ నాగమణి, భగవాన్ జయరాం, కొటాన రాము, సబ్బవరపు ముత్యాలనాయుడు, నక్కా కనకరాజు పాల్గొన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన జెసి

ఆనందపురం : ఆనందపురం సచివాలయాన్ని విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ సందర్శించారు. జులై 1న జగనన్న సురక్ష కార్యక్రమం ఆనందపురం గ్రామంలో నిర్వహిస్తున్నందున గడపగడపకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. పరిష్కారం కాని సమస్యలను వాలంటీర్లు గుర్తించి సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. అనంతరం గ్రామాలలో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలోఎంపిడిఒ లవరాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు, స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి, కో-ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షులు చందక సూరిబాబు, కొట్యాడ రెడ్డిబాబు, గ్రామ కార్యదర్శి శ్రీరామ్‌మూర్తి, విఆర్ఒ అప్పలరాజు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే పరిశీలన

అనకాపల్లి : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 11 రకాల సర్వీసులను ప్రజలకు అత్యంత చేరువలో సులభంగా ఉచితంగా అందిస్తున్నట్టు ఆర్డీవో చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని తుమ్మపాల, కోడూరు గ్రామాల్లో శనివారం జరిగిన సర్వే కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలు, మ్యూటేషన్, ఆధార్‌కు ఫోన్ నెంబర్ అనుసంధానం, పంట సాగు హక్కు, బియ్యం కార్డు, హౌస్ హెూల్డ్ స్పెట్టింగ్ వంటి సేవలు ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు తట్ట పెంటయ్య నాయుడు, సేనాపతి లక్ష్మీ శ్రీనివాస్, తహశీల్దారు గంగాధర్‌రావు, ఈవోపీఆర్డి ధర్మారావు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి త్రినాధరావు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సాయంత్రం తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సీతారామరాజు ల ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, నెల రోజు ల పాటు జరగనున్న జగనన్న సురక్షలో పాల్గొని ప్రజలకు సేవలు అందించాలన్నారు. ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు.

నక్కపల్లి: మండలంలోని వేంపాడు, కాగిత గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అధికారులు సర్వే చేపట్టారు. వేంపాడులో ఎంపీడీవో సీతారామరాజు, కాగితలో తహసీల్దార్ అంబేద్కర్ బృందాలు గ్రామాల్లో ఇంటింటికి వాలంటీర్లతో కలిసి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేంపాడు సర్పంచ్ నూకరత్నం, వైసిపి నాయకులు మణి రాజు, డీటీ నీరజ పాల్గొన్నారు.

గొలుగొండ: గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి జగనన్న సురక్ష పథకం విధివిధానాలపై అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి మోహన్‌రావు సూచించారు. సిహెచ్.నాగాపురం గ్రామంలో పథకం సర్వే వివరాలపై సచివాలయ సిబ్బందితో శనివారం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంపై క్షేత్ర స్థాయిలో సర్పంచ్ రఘురామచంద్రరావుతో కలిసి లబ్ధిదారులకు వివరించారు. పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఒపిఆర్‌డి రఘురాం, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుదీష్ణ, వీఆర్వో సత్యనారాయణ పాల్గొన్నారు.

రమేష్ మృతి బాధాకరం

ప్రజాశక్తి-విశాఖపట్నం : దళిత సంక్షేమ సమతా సంఘం వైస్ ప్రెసిడెంట్ అడపా రమేష్ మృతి బాధాకరమని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పేర్కొన్నారు. కీర్తిశేషులు అడపా రమేష్ సంతాప సభను కంచరపాలెం బర్మాక్యాంప్ సమీపంలోని జై భారత్‌నగర్‌లో శనివారం నిర్వహించారు. సంతాప సభకు జియ్యాని శ్రీధర్ హాజరై రమేష్ తల్లిదండ్రులు అడపా గణేష్ ,ఆదిలక్ష్మి, భార్య మహేశ్వరి, కుమారుడు మోహిత్ శివ సాయిని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దళిత సంక్షేమ సమతా సంఘం వైస్ ప్రెసిడెంట్ పనిచేసి ప్రజలతో మమేకమయ్యారని తెలిపారు. దళిత సంక్షేమ సమతా సంఘం అధ్యక్షులు అడపా హేమంత్‌కుమార్ మాట్లాడుతూ, అన్నయ్య కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో 48వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి ఎన్.రవి, కర్రి రామారెడ్డి, 48 వార్డు వార్డు టిడిపి నాయకులు గొర్ల అప్పారావు, గ్రామ అధ్యక్షులు బొగ్గు శ్రీను, వైసిపి నాయకులు, దళిత సంక్షేమ సమతా సంఘం సభ్యులు, అంబేద్కర్ భవన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

25వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి రాజేంద్రనగర్, కనకమ్మ వారి వీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ఇప్పటికే రాష్ట్రంలో శాచురేషన్ పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మంచి చేశారన్నారు. ఏ కారణం చేతనైనా ఎవరైనా మిగిలి ఉంటే వారికి కూడా సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయానికీ రూ.20 లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, 25వ వార్డు నాయకులు సానబోయిన సురేష్, బోగవల్లి గోవింద్, సారిపిల్లి సంతోష్, సన్నీ, గోవిందమ్మ, గౌరి, సీనియర్ నాయకులు షేక్ బాబ్జి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

'ఇందు' డ్యాన్స్ అకాడమీ రజతోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇందు ఫైవ్‌స్టార్ డ్యాన్స్ అకాడమీ రజతోత్సవాన్ని విశాఖ పౌర గ్రంథాలయంలో కొరియోగ్రాఫర్ పల్లా శివకుమార్, డైరెక్టర్ యశ్వంత్ నిర్వహణలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా హాజరై ఎయు పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్లకు చెందిన అనేకమంది చిన్నారులు వెస్ట్రన్, క్లాసికల్, ఫోక్ డాన్సులతో అలరించారు. విజయ వేణి, నాగరాజు పట్నాయక్, యశ్వంత్, సాయి, మంజుల, మహావీర్‌రెడ్డి, తెలుగు అర్జున్, శ్రీనివాసరావు, తదితరులు అవార్డులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, కళాకారునిగా పదిమంది ఆదరాభిమానాలు పొందడం గొప్ప విషయమన్నారు. పలువురు కళా సంఘాల ప్రతినిధులను, డ్యాన్స్ మాస్టర్లను, అవార్డులు పొందిన కళాకారులను అతిథులందరూ కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా సినిమా నటి సునీత, కొరియోగ్రాఫర్ నాని, నటుడు బాబుదేవ్, పలువురు డాన్స్ డైరెక్టర్లు, బాబురాజ్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక కాపు సంక్షేమ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -గాజువాక : శ్రీ కృష్ణదేవరాయ గాజువాక కాపు సంక్షేమ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక శనివారం నడుపూరులో నిర్వహించారు. అధ్యక్షులుగా జెర్రిపోతుల ముత్యాలు, ప్రధాన కార్యదర్శిగా తలారి వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కర్ణం బాబూరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ముత్యాలు మాట్లాడుతూ, మిగతా కార్యవర్గాన్ని ఎంపిక చెయ్యటానికి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పూర్తి అధికారం కలిగి ఉంటారని సమావేశంలలో తీర్మానించినట్లు తెలిపారు. రాబోవు కాలంలో నియోజకవర్గంలో అందరి సహకారంతో పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.



మాట్లాడుతున్న ముత్యాలు

ఆర్థిక పరిపుష్టికి బ్యాంకులే మూలం

జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఏ ప్రాంతమైన ఆర్థికంగా పరిపుష్టి సాధించాలంటే బ్యాంకులే కీలకమని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో నాల్గవ త్రైమాసికంలో బ్యాంకులు సాధించిన లక్ష్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయం, కౌలు రైతులు, స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు మొదలైన వాటికి తగిన రుణాలు అందించి బ్యాంకర్లు జిల్లా ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. జిల్లా వేగంగా అభివద్ధి చెందాలంటే ప్రభుత్వ, బ్యాంకుల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇకపై సమావేశాలకు పూర్తి సమాచారంతో బాధ్యత గల అధికారులు పాల్గొవాలని ఆదేశించారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలన్నారు. వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి వాటి అభివృద్ధికి నిపుణులతో అధ్యయనం చేయించాలన్నారు. జగనన్న తోడు, స్వనిధి, టిడ్కో, పీఎంఐజిపి, పిఎంఎంఎస్‌వై, పిఎంఎఫ్ఎంఈ రుణాలపై సమీక్ష జరిపి వేగంగా గ్రౌండింగ్ పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రిజర్వు బ్యాంకు జిల్లా ప్రతినిధి పూర్ణిమ, నాబార్డ్ జిల్లా అధికారి శ్రీనివాసులు, డిడిఎమ్ నాబార్డ్ జిఆర్.సామంత్ కుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

పోలీసు కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- అనకాపల్లి

విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదం, అనారోగ్య సమస్యలతో మృతి చెందిన పోలీసు కుటుంబాలకు శనివారం ఎస్‌పి మురళీకృష్ణ ఆర్థిక సహాయం అందజేశారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హెచ్‌సీ 897 జి.దేముడు గొలుగొండ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తూ ఆనందపురం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన భార్య దేవికి, అనారోగ్య కారణాలతో మృతి చెందిన హెచ్‌సీ 645 జి.అప్పన్న భార్య ధనలక్ష్మికి, దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన పిసి 1425 కె.అప్పారావు కూతురు మోక్షితలకు గ్రాంట్, ఫ్లాగ్ ఫండ్ నుండి ఒక్కొక్కరికి రూ.75 వేలు చొప్పున నగదు చెక్కులను అందజేసినట్లు చెప్పారు. పోలీసు శాఖలో పని చేస్తూ విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. ధైర్యంగా ఉండాలని, పోలీస్ శాఖ తరపున వారి కుటుంబాలకు అన్ని రకాలుగా సహాయ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, డి.పి.ఓ ఏ.ఓ బి.శారద, ఆఫీస్ సూపరింటెండెంట్ బి.నిర్మల పాల్గొన్నారు.



తీర్థయాత్ర బస్సును ప్రారంభిస్తున్న ఎంవిఆర్

ఎంవిఆర్ ఉచిత తీర్థయాత్ర

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత నిత్య తీర్ధ యాత్రలు జోరుగా కొనసాగుతున్నాయి. స్థానిక నర్సింగరావుపేట ఎంవీఆర్ కార్యాలయం నుండి శనివారం ముత్యాల వెంకటేశ్వరరావు పచ్చ జెండా ఊపి యాత్ర బస్సును ప్రారంభించారు. సింహాచలం, అన్నవరం, కనకమాలక్ష్మి ఆలయ దర్శనములకు భక్తులతో బస్సులు బయలు దేరాయి. ఈ యాత్రలో భక్తులకు ఏటువంటి అసౌకర్యం కలగకుండా ఉదయం అల్పా హారం, మధ్యాహ్నం భోజనం సదుపాయం, రాత్రికి అల్పారం, తాగునీటి సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి సేంద్రియ వ్యవసాయం అవసరం

ప్రజాశక్తి - పరవాడ

ప్రజారోగ్యానికి సేంద్రియ పద్ధతిలో చేసే వ్యవసాయం చాలా అవసరమని రీ సస్టైనబిలిటీ లిమిటెడ్ హెడ్ కె.రవికుమార్ పేర్కొన్నారు. శనివారం రీ సస్టైనబిలిటీ సహకారంతో స్వయభువరం గ్రామంలో రాంకీ ఫౌండేషన్ అమలు చేస్తున్న సేంద్రియ వరి సాగు ప్రాజెక్టులో భాగంగా రైతులకు వరి విత్తనాలు, సేంద్రియ ఎరువులు, పురుగుల మందుల పంపిణీ చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవికుమార్ మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధి పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా ఆహార పంటలు కూడా కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆహార పదార్థాలు మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. దీనిపై చైతన్యం కలిగించాలనే ఉద్దేశంతో రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రీ సస్టైనబులిటీ లిమిటెడ్ అమలు చేస్తున్న ఈ ప్రాజెక్టులో పాల్గొన్న రైతులు పాల్గొనం అభినందనీయమన్నారు. రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా స్వయభువరం గ్రామంలో ఈ ప్రాజెక్టు అమలు చేస్తూ మంచి ఫలితాలు సాధించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రావతి, ఆర్ఎస్ఎల్ హెచ్ఆర్ మేనేజర్ శివారెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది అనిత, రాంకీ ఫౌండేషన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసరెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

27న యలమంచిలిలో మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి-చోడవరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 27న రెండు కంపెనీలతో మినీ జాబ్ మేళా నిర్వహిస్తునట్లు నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరముల లోపు వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7036363272 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

తాగునీటి బోరు ఏర్పాటు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- బుచ్చయ్య పేట

బుచ్చయ్యపేట మండలంలోని కొండెంపూడి, నీలకంఠాపురం, పెదమదిన గ్రామాలలో తాగునీటి బోరు తవ్వకం పనులను శనివారం జెడ్పిటిసి దొండా రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పిటిసి గ్రాంట్ నిధులను తాగునీటి వసతులు మెరుగుకే ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామాలలో బోర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బోరు బావి ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి రాంబాబు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి - కశింకోట

అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని కశింకోట మండల పరిషత్ అధ్యక్షురాలు కలగా లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులు గుర్తించడం జరుగుతుందని తెలిపారు. ఎంపీడీవో వివి రవికుమార్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా వాలంటరీలతో సర్వే చేయించి లబ్ధిదారుల రిపోర్ట్ అందించాలని కోరారు. తహశీల్దారు జి సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైన సందర్భంగా కుల ధ్రువీకరణ పత్రాలు కావలసిన అవసరం ఉంటుందని ఎవరు ఇబ్బంది పడకుండా రెండు మూడు రోజుల్లోనే వారికి అందే విధంగా అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంఈఓ చిట్టిబాబు, జెడ్పిటిసి శ్రీధర్ రాజు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, నమ్మి మీనా గణేష్, సర్పంచ్‌లు కలగా గున్నయ నాయుడు, మంత్రి జయ రజిని, చేకూరి మహేశ్వరరాజు, కోన నాయుడు, హనుమంతు వెంకట లక్ష్మణరావు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి కలగా లక్ష్మి

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి

ఎంపీ డాక్టర్ సత్యవతి

ప్రజాశక్తి-అనకాపల్లి

అభిరుచుల సాధన కోసం కషి చేస్తూ దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని పార్లమెంటు సభ్యురాలు భీశెట్టి వెంకట సత్యవతి పిలుపునిచ్చారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకే) ఆధ్వర్యంలో అనకాపల్లి శ్రీగౌరీ గ్రంథాలయంలో 'యువ ఉత్సవ్-2023' వేడుకలను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి ఆలోచనలు, ఆకాంక్ష, సామర్థ్యం గల యువత ద్వారానే భారతదేశ పరివర్తన అనే పెను సవాలు సాధ్యమవుతుందని చెప్పారు. విద్యార్థులను సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి, దేశ అవసరాలకు ఉపయోగపడగలిగే భవిష్యత్ నాయకులుగా ఎదిగేలా చేసేందుకు గౌరీ గ్రంథాలయం అందిస్తున్న సేవలను ఎంపీ సత్యవతి కొనియాడారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి జి.మహేశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎన్‌వైకే రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ, సెట్విస్ మేనేజర్ కెవిఎస్ఎన్.మూర్తి, ఎన్‌వైకే ఏపీఎస్ అల్లం రామప్రసాద్, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఫీల్డ్ పబ్లిసిటీ అసిస్టెంట్ ఐ.షరీఫ్, ఎన్‌వైకె.జాతీయ అవార్డు గ్రహీత ఆర్.లీలాప్రసాద్‌రెడ్డి, జిల్లా క్రీడాప్రాధికారిక సంస్థ అధికారి అనంత లక్ష్మి, గౌరీ గ్రంథాలయ ఉపాధ్యక్షుడు కాండ్రేగుల జగ్గారావు, ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీతలు కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ), కాండ్రేగుల శంకరబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం యువ ఉత్సవ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను ఎంపీ సత్యవతి సందర్శించారు.



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ సత్యవతి

'జగనన్న సురక్ష'కు ప్రజలను సంసిద్ధులు చేయాలి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ రమాకుమారి

ప్రజాశక్తి - యలమంచిలి

జులై 1 నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష పథకంలో ప్రజాసమస్యలు లేవనెత్తే విధంగా ప్రజలను సంసిద్ధుల్ని చేయాలని కౌన్సిలర్లకు మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం రమాకుమారి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. తొలుత కమిషనర్ వీరయ్య జగనన్న సురక్ష పథకం వివరాలు వెల్లడించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఏయే వార్డుల్లో ఏయే సమస్యలు ఉన్నాయో గుర్తించాలని కోరారు. పూర్తయిన 412 టిడ్కో ఇళ్ల పంపిణీ మొదలైతే సమస్య జఠిలమయ్యేలా ఉందని అధికార్లను హెచ్చరించారు. ఇళ్ల దక్కని పేదవారు కట్టిన రూ.49 లక్షలు తిరిగి చెల్లించిన తరువాతే ఇళ్ల పంపిణీ చేయాలని సూచించారు. టిడ్కో లబ్ధిదారులకు వాడుకనీరు అందించవచ్చుగాని, మంచినీటి సౌకర్యం ఆదరా బాదరాగా కల్పించగలరో లేదో ఆలోచించాలన్నారు. రెవెన్యూ సమస్యలు, కాలనీ పట్టాలు మొదలైన వాటిలో రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మున్సిపాలిటీలో కలవక పంచాయతీగా ఉన్న సమయంలో కుళాయిలు పొందిన వారిని తిరిగి కనెక్షన్ ఛార్జీలు చెల్లించమంటే ఎవరూ సుముఖత చూపించరని, వారిని లబ్ధిదారులకు ప్రకటించి కుళాయి సెస్ చెల్లించే విధానం రూపొందించాలని కోరారు. దాతలు సహకారంతో ఆడారి తులసీరావు ట్రస్టు కొనుగోలు చేసిన అంతిమయాత్ర వాహనం మున్సిపాలిటీకి అప్పగిస్తున్నట్లు రమాకుమారి ప్రకటించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాస్, రెవెన్యూ డిటి ఆచారి, విద్యుత్‌శాఖ దొర, మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ నీలిమ, వార్డు కౌన్సిలర్లు, సిబ్బంది హాజరయ్యారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి



కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం

హర్ దిల్ మే వైయస్సార్, హమ్ సబ్ జగన్ కే సాథ్‌లో భాగంగా స్థానిక జుమా మసీద్ వద్ద రాష్ట్ర మైనార్టీ రీజనల్ కోఆర్డినేటర్ బకత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుక్ స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్సార్ ప్రభుత్వం మైనార్టీలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో నలుగురు ఎమ్మెల్యేలు మరో నలుగురు ఎమ్మెల్సీలను ఇచ్చి గౌరవించిందని తెలిపారు. గత ప్రభుత్వాలు మునుపెన్నడూ ముస్లిములకు ఈ గౌరవాన్ని ఇవ్వలేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి మరింత ప్రాధాన్యత కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఒరుగంటి నెహ్రూ, ఉప్పల బాబు, మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గ్యాస్ సిలిండర్ల బరువు తనిఖీ చేయాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి :గ్యాస్ గోడౌన్లలో గ్యాస్ సిలిండర్ల బరువును అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు శనివారం ఆర్డీఓ కార్యాలయం పరిపాలన అధికారిణి జయశ్రీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది గ్యాస్ డీలర్స్ వినియోగదారులకు సరఫరా చేస్తున్న గ్యాస్ సిలిండర్లలో సుమారు రెండు కిలోల వరకు తక్కువగా నింపుతున్నట్లుగా వినియోగదాల నుంచి తమకు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఇప్పటికే గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో తక్కువ గ్యాస్ నింపి నష్టె చేయడం వినియోగదారులకు అదనపు భారంగా మారుతుందని తెలిపారు. తక్కువ గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో సమావేశం

ప్రజాశక్తి-సబ్బవరం

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎంఇఓ ఎస్.అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ సమిష్టిగా పనిచేస్తూ మండలంలో విద్యావ్యాప్తికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. ఎంపీడీఓ బి. రమేష్ నాయుడు మాట్లాడుతూ విద్యా ప్రగతిలో మండలం జిల్లాలో మొదటి స్థానంలో ఉండాలని, డ్రాపౌట్స్ లేకుండా శత శాతం విద్యార్థులను నమోదు చేసుకొని, గుణాత్మకమైన విద్యను అందించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ-2 బి.సూర్యనారాయణ మూర్తి, ఎంఐఎస్ కో-ఆర్డనేటర్ మహేష్, సిఆర్‌పిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి బోకం సూర్యకుమారి

జర్మనీలో స్టాఫ్ నర్స్ ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపిఎస్ఎస్‌డిసి)- టీఏకేటీ ఇంటర్నేషనల్, ఏపీఎన్ఆర్‌టిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో బిఎస్‌సి నర్సింగ్ చదువుకున్న వారికి జర్మనీలో స్టాఫ్ నర్స్ ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థి జర్మనీలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. తప్పనిసరిగా బిఎస్‌సి నర్సింగ్ పూర్తయి, కనీసం 2 సంవత్సరాల పని అనుభవం ఉండి, 20 - 35 మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. విజయవాడలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో 2 నెలల పాటు నిర్వహించే బి వన్ స్థాయి జర్మన్ భాషా శిక్షణ కోసం ఉచిత తరగతులకు హాజరు కావాలని, అందులో ఉత్తీర్ణత సాధించిన తర్వాత, జర్మనీలో పని చేయడానికి ఆఫర్ లెటర్ ఇవ్వబడుతుందని తెలిపారు. విమాన ఛార్జీలు, ఆహారం వసతి, మొదటి ఆరు నెలలకు ఉచితమని, ప్రారంభ స్థూల జీతం నెలకు యూరోలు 1,000 (రూ.89,000) అని, తర్వాత 6 నెలల పాటు జర్మనీలో బి2 సర్టిఫికేషన్ కోసం శిక్షణ ఇస్తారని, బి2 పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే జీతం నెలకు దాదాపుగా 2,500 యూరోలు (రూ.2,00,000 నుండి రూ.2,50,000), వరకు పెరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ తరగతులు కేఎల్ విశ్వవిద్యాలయంలో జూలై 1న ప్రారంభమవుతాయని, విద్యార్థులు డే స్కాలర్‌లుగా / హాస్టల్‌లో ఉండడానికి ఎంచుకోవచ్చని తెలిపారు. శిక్షణ కాలంలో హాస్టల్ అభ్యర్థి హాస్టల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 30వ తేదీ లోగా www.apssdc.in/home/onlineProgramRegistration లింక్ ద్వారా ఆసక్తిగల అభ్యర్థులు సర్టిఫికెట్, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు bala.m@apssdc.in మెయిల్ ఐడి, లేదా 9908629287 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ చిన్నికృష్ణ

జగనన్న గృహ నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి

జగనన్న గృహ నిర్మాణాల్లో ఉన్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆర్డీవో చిన్నికృష్ణ ఆదేశించారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం మండలంలోని అక్కిరెడ్డిపాలెంలో గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. అక్కడ నిర్మాణదారులతో మాట్లాడారు. స్థానిక సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుదీకరణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ సాలాపు శాంతి సూరి అప్పారావు, ఈవోపీఆర్డీ ధర్మారావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కె.కోటపాడు

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను వెంటనే ఆదుకోవాలని కోరుతూ సిపిఎం ముద్రించిన వాల్ పోస్టర్‌ను మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు ఎర్ర దేముడు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన ఈనెల 20 నుంచి, జులై 4 వరకు పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు ఆర్అర్ ప్యాకేజీ, పునరావాసం ఇవ్వాలని 9 సంవత్సరాలుగా అనేక పర్యాయాలు విన్నపవాలు చేసినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకునే పాపాన్ని పోలేదని విమర్శించారు. పోలవరం ముంపు గ్రామాలైన 194 గత ఏడాది వరదలలో పూర్తిగా మునిగిపోయి అపారమైన నష్టం సంభవించినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం ఎటువంటి పరిహారం ఇవ్వలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వల్లకి మోస్తున్నాయని విమర్శించారు. పోలవరం నిర్వాసితులను వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వనము సూర్యనారాయణ, సానుభూతిపరులు ఎం అప్పారావు, బొడ్డు నరసింహమూర్తి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

నరసింహ అవతారంలో జగన్నాథుడు

ప్రజాశక్తి-చోడవరం

జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్థానిక కేశవ స్వామి ఆలయంలో దశావతారాల్లో జగన్నాథుని రూపాలను నెలకొల్పారు. శనివారం నరసింహ అవతారంలో జగన్నాథుని కొలువు తీర్చారు. శనివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. పది రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమాలు 30వ తేదీ రథోత్సవంతో ముగుస్తుందని ఆలయ ప్రధాన అర్చకులు ఆచార్యులు తెలిపారు.

ప్రజా సంక్షేమం కోసమే 'గడపగడపకు'

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

ప్రజా సంక్షేమం కోసం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. శనివారం ఉదయం ఆయన తురకలపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేవా అని ఆరా తీశారు. పలువురు గ్రామస్తులు తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి విన్నవించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చంనాయుడు, నాయకులు దాకారపు నాగరాజు, కోరుకొండ అప్పలనాయుడు, ఉప సర్పంచ్ గంట్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఏఎంఏఎల్ విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు జి.చిరంజీవి, పి.హేమ ఆంధ్రప్రదేశ్ టీం తరుపున పాల్గొన్నట్లు ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయబాబు తెలిపారు. వీరు పాల్గొనడం పట్ల శనివారం కళాశాల అధ్యక్షులు కెఎస్ఎన్.మంగరాజు, కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, జిబి మెంబర్ వాసిరెడ్డి బాలకృష్ణ, సూపరింటెండెంట్ పి.అనురాధ, ఫిజికల్ డైరెక్టర్స్ డాక్టర్ కెవిఎస్.నాయుడు, వై.నాయుడు, కోచ్ ఎ.నూకయ్య నాయుడు, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు అభినందనలు తెలియజేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

తాగునీటి సమస్యపై సిపిఎం వినతి


ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రోలుగుంట:నల్లరాయి క్వారీ, ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలలో తక్షణమే మంచినీటి సమస్య పరిష్కారం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం నర్సీపట్నం ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ, రోలుగుంట కేంద్రంతో పాటు 8 గ్రామాల ప్రజలు గత ఐదు రోజుల నుండి మంచినీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్వారీ ప్రభావిత గ్రామాల్లో ఫ్లోరైడ్ నీరు కారణంగా బోరు నీటిని ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. తొమ్మిది గ్రామాల మధ్యలో 30 నల్లరాయి క్వారీలు కార్యకలాపాలతో భూగర్భ జలాలు అడుగంటి ఫ్లోరైడ్‌గా మారి ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యకి గురవుతున్నారన్నారు. ఇటువంటి తరుణంలో క్వారీ యాజమాన్యం సిఎస్ఆర్ నుంచి కనీసం మినరల్ వాటర్ ప్లాంట్‌తోనైనా నీరు సరఫరా చేయడం లేదన్నారు. గతంలో పర్యావరణ అనుమతుల కోసం గ్రామసభలో ఏర్పాటు చేసేటప్పుడు ప్రజల కోసం మంచినీరు, వైద్యం వంటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని మర్చి పోయారన్నారు. జానకిరాంపురం గ్రామం నుండి లిఫ్ట్ ద్వారా పంపింగ్ చేసి రోలుగుంట మండల కేంద్రానికి నీరు సరఫరా చేసే బోరు మరమ్మత్తులకు గురి కావడంతో మంచినీరికి తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని ఆర్డీవోకు వివరించారు. దీనిపై స్పందించిన ఆర్డీవో రోలుగుంట తహశీల్దార్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కారం చేయాలని ఫోన్‌లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చంద్రరావు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

-టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు అయ్యన్న


హారతి ఇస్తున్న మహిళలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశంతో నర్సీపట్నం నియోజకవర్గంలో శనివారం బస్సు యాత్ర ప్రారంభించారు. దీనిలో భాగంగా స్థానిక బంగారురాజు థియేటర్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు అధ్యక్షత యాత్రను చేపట్టారు. నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, తన పదవీ కాలంలో నియోజకవర్గంను ఎంతో అభివృద్ధి చేశానన్నారు. విద్యా వైద్యపరంగా నర్సీపట్నం నియోజవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా సత్యనారాయణ స్వామి దేవాలయం దగ్గర కళ్యాణ మండపం, ఇంటింటికి నీరు ఇప్పటికీ అందించలేక పోయారని విమర్శించారు.

మాజీ స్పీకర్ ప్రతిభ భారతి మాట్లాడుతూ, చంద్రబాబుకు సంపద సృష్టించడం తెలుసని జగన్మోహన్ రెడ్డికి దోచుకోవడం మాత్రమే తెలుసని అన్నారు. రాష్ట్రంలోకి సంక్షేమ పథకాలు తెచ్చింది మొట్టమొదట ఎన్టీ రామారావు అని దళితులకి ఎన్నో పథకాలు అందజేశారన్నారు. దళిత మహిళగా గుర్తించి స్పీకర్ పదవిని కట్టబెట్టారని ఆమె తెలిపారు.దళితుల్ని మోసం చేస్తున్న జగన్ రెడ్డికి బుద్ధి చెప్పాలన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీలకు గురుకులాలను ఏర్పాటు చేసింది అన్న నందమూరి తారక రామారావు అని అన్నారు. మాజీ మంత్రి కళా వెంకట్రావు, బండారు సత్యనారాయణ, రామానాయుడు, కేఎస్ఎం రాజు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, జడ్పిటిసి సుకల రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ :తెలుగుదేశం పార్టీ చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం రాత్రి మండల కేంద్రం మునగపాకకు చేరింది. అక్కడ రాత్రి పల్లె నిద్ర చేసింది. ఈ సందర్భంగా స్థానిక రాధాకృష్ణ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ చిరంజీవిరావు మాట్లాడారు. టిడిపి నాయకులు బొండా జగన్నాథం, బుద్ద నాగ జగదీష్, పప్పల చలపతిరావు, దాడి ముసలి నాయుడు, దొడ్డి శ్రీనివాసరావు, ఆడారి మంజు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : జగన్ పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. టిడిపి చైతన్య యాత్ర పూడిమడక గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, బండారు సత్యనారాయణమూర్తి, రమేష్ కుమార్ పాల్గొన్నారు.

కశింకోట : శనివారం జరిగిన టిడిపి బస్సు యాత్రలో అనకాపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు హాజరై మాట్లాడారు. మళ్ల సురేంద్ర, కాయల మురళి, ఉగ్గిన రమణ మూర్తి, గొంధిన శ్రీనివాసరావు, సబ్బవరపు గణేష్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : తెలుగుదేశం పార్టీ చేపట్టిన బస్సు యాత్ర ఈ నెల 26న మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నిర్వహించడం జరుగుతుందని, యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిజి కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ 26న రాత్రి 7 గంటలకు కె.కోటపాడు మండలం కింతాడ గ్రామానికి చేరుకుని రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తామని, ఆ గ్రామంలోనే పల్లె నిద్ర చేస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పార్టీ సీనియర్ నాయకులు పైల ప్రసాదరావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ఈ నెల 25న చోడవరం నియోజకవర్గంలో జరిగే టిడిపి బస్సు యాత్రలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు పిలుపునిచ్చారు.

రోలుగుంట:రోలుగుంట మండలం వెలంకాయలపాలెం నుండి ఈ నెల 25న చేపట్టే భవిష్యత్ గ్యారంటీ బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంపిటిసి సుర్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం ఈ యాత్రకు సంబంధించి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.


మాట్లాడుతున్న అప్పలరాజు

విద్యతోనే సమాజంలో గుర్తింపు

ప్రజాశక్తి -కొత్తకోట:విద్యతోనే సమాజంలో గౌరవంతో పాటు గుర్తింపు లభిస్తుందని జిల్లా ఎస్పి సెల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎం.అప్పలరాజు, రేబాక మధుబాబు అన్నారు. శనివారం రావికమతం మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్య పై పలు సూచనలు చేశారు. బాలికలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని కోరారు. విద్యలో ఆంగ్లం, లెక్కలు సబ్జెక్టుల పై పట్టు సాధించాలన్నారు. క్రీడలలో పాల్గొని మానసిక, శారీరకంగా ధృఢ పడాలని వారు విద్యార్థినులకు సూచించారు. ప్రభుత్వం ఇస్తున్న విద్యా దీవెన, అమ్మఒడి, హాస్టల్ సౌకర్యాలను వినియోగించుకొని భవిష్యత్తులో భావితరాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి రమణబాబు, దళిత సంఘ నాయకులు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:ధర్మవరం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు ఈనెల 25న అంతరాయం ఏర్పడనుందని కొరుప్రోలు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీరు డి.రవి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక విలేఖరులకు ఇచ్చిన సమాచారం మేరకు కొరుప్రోలు సెక్షన్ పరిధిలోని ధర్మవరం సబ్ స్టేషన్ లో 11 కెవి లైనులు ఏర్పాటు చేయుటకు గాను ఆదివారం ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. దీంతో సబ్ స్టేషన్ పరిధిలోని ధర్మవరం, గెడ్డపాలెం వ్యవసాయ సంబంధిత లైనుకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని ధర్మవరం సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.


చెత్తా చెదారం తొలగిస్తున్న యువకులు

పాఠశాలలో శ్రమదానం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:మండలంలో ధర్మవరం అగ్రహారం ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గ్రామ నాయకులు, యువకులు తుప్పలు తొలగించి చెత్తను శుభ్రం చేసి శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వైసిపి నాయకులు కర్రి శీను బాబు, మాజీ వార్డు మెంబర్ కోసూరు సత్యనారాయణ, 1వ వార్డు మెంబర్ పలకా రమణ, కట్టుమూరి ఈశ్వరరావు, కట్టుమూరి జగదీష్, శీరం భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యలపై సిపిఎం పోరుబాట

ప్రజాశక్తి-నక్కపల్లి:పాయకరావుపేట నియోజకవర్గంలో సమస్యల పరిష్కారంపై సిపిఎం ఆధ్వర్యంలో పోరుబాట పట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు తెలిపారు. నక్కపల్లిలో పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి, నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి సొంత భవనాలు, ఉద్దండపురం వద్ద మెగా వాటర్ ప్రాజెక్టు పూర్తికి, హెటిరో పైపులైనుకు అనుమతులు వెంటనే రద్దు చేయాలని, వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ

ప్రజలు ఎదుర్కొంటున్న


మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు

చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే జాతీయ రహదారిపై గ్రామాల కూడలిలో విద్యుత్ లైట్లు ఏర్పాటు, ఎస్.రాయవరం మండలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు, బంగారమ్మపాలెం ఎన్ఎఒబి నిర్వాసితులకు ప్యాకేజీ, తాండవ, వరాహ నదులకు పటిష్టమైన గట్లు, మూసివేసిన తాండవ, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి నడిపించాలన్నారు. పాయకరావుపేటలో మెయిన్ రోడ్డు విస్తరణ, రోడ్డుకు ఇరు వైపులా చిల్లర వర్తకులకు ఉపాధి కల్పించాలని, కోటవురట్ల మండలం జల్లూరు, యండపల్లి, పందూరు వద్ద వరహా నదిపై బ్రిడ్జి లను వెంటనే పూర్తి చేయాలని, పోడు భూముల సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పోరాటం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు బి.రాము, ఎం.మహేష్‌బాబు, జి.రమణ, బి.రమేష్, అప్పలరాజు, ఎం.లోవరాజు, ఎం.నానాజీ, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయానికి వితరణ

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలోని పోలి పిల్లమ్మ ఆలయానికి ఒక కుటుంబం బంగారు వంగళ నాత్రాలు సమర్పించింది. గ్రామానికి చెందిన పండా బుజ్జి సుజాత దంపతుల కుమార్తె అల్లుడు శ్యామల సుధీర్ దంపతులు అమ్మవారికి బంగారు మంగళ సూత్రాలు తయారు చేయించి శనివారం సమర్పించారు. బుజ్జి కుమారులు సురేష్ కుమార్ సబిత నాగేంద్ర కుమార్ శ్రీ విద్య దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించి నైవేద్యం సమర్పించారు. ఆలయం తరుపున ధర్మకర్తలు నల్లబిడ్డి కుటుంబానికి చెందిన నాగు వీరికి మెమొంటోలను అందజేశారు.


వితరణ అందజేస్తున్న దాతలు

విభిన్న ప్రతిభావంతులకు అభినందనలు

ప్రజాశక్తి- రావికమతం :యోగా ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు హాజరైన మేడివాడ హైస్కూల్ దివ్యాంగ విద్యార్థులు, స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంకాయల రామారావు, ఎంపీటీసీ సత్య ప్రసాద్, పాఠశాల చైర్మన్ శేషుబాబు, వజ్రపు శివ, పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈనెల 21తేదీన అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ గ్రౌండ్స్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష, రోటరీ క్లబ్ (విశాఖపట్నం), ఆంధ్ర యూనివర్సిటీ యోగా డిపార్ట్మెంట్ సంయుక్తంగా నిర్వహించిన యోగా ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అనకాపల్లి, విశాఖపట్నం విజయనగరం జిల్లాలకు చెందిన 500 మంది దివ్యాంగ విద్యార్థులు వివిధ యోగాసనాలు వేశారు. రావికమతం మండలం నుండి ముగ్గురు దివ్యాంగ విద్యార్థులు పాల్గొని వండర్ బుక్ అఫ్ రికార్డులో భాగస్వామ్యం అయినందుకు వీరంతా ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఎర్రయ్య, నాగేశ్వరరావు, గోవిందరావు, రమణాజి, పాపారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


అభినందిస్తున్న హెచ్ఎం, నాయకులు

దళితుల అభ్యున్నతికి కృషి చేయాలి

ప్రజాశక్తి-మాడుగుల:దళితుల అభ్యున్నతి, అభివృద్ధికి అందరూ సహకరించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేపాక మధుబాబు, మరువాడ ఈశ్వరరావు కోరారు. శనివారం మాడుగుల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విభిన్న కోణాలలో దళితులు అన్ని విధాలుగా అభివృద్ధి సాధించేందుకు అందరూ సహకరించాలని,ఈ మేరకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



వినతి పత్రం అందిస్తున్న నేతలు

2022-23 పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో
రాష్ట్ర, జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ
కనబరిచిన మా పాఠశాల విద్యార్థినులకు
హృదయపూర్వక శుభాకాంక్షలు
కోడి రాంబాబు
ప్రిన్సిపాల్ MA.MEd.,
ఎ.పి. బాలికల గురుకుల పాఠశాల
భీమునిపట్నం.





మోకాళ్లపై నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

మత్స్యకారుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి:హెటిరో ఫైప్ లైన్ ఏర్పాటును అడ్డుకుంటామని మత్స్యకారులు స్పష్టం చేశారు. కంపెనీ కొత్తగా వేస్తున్న పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 564వ రోజుకు చేరింది. శనివారం శిబిరం వద్ద మత్స్యకారులు పైపులైన్ కు వ్యతిరేకంగా మోకాళ్లపై నిలబడి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పైపులైన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ మత్స్యకార జేఏసీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పిక్కి స్వామి మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎట్టి పరిస్థితుల్లోనూ పైపులైనుకు అనుమతులు ఇవ్వకూడదన్నారు. న్యాయం జరిగే వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు చేపల సోమేష్, వాసపల్లి నూకరాజు, కోడా కాశీరావు, కొత్తవాల జగ్గా, పిక్కి ఆనంద్, పిక్కి రాజు, వాసపల్లి స్వామి, పిక్కి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

రోడ్డు భద్రతపై ర్యాలీ

ప్రజాశక్తి -రావికమతం:రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వెలుగు ఎపిఎం తిలక్ సూచించారు. మండల కేంద్రం నాలుగు రోడ్ల కూడలి వద్ద వెలుగు సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ, రోడ్డు నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. రోడ్డు మార్గం గుండా వెళ్లేటప్పుడు సూచికలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అతివేగంగా, మద్యం సేవించి డ్రైవ్ చేయకూడదన్నారు. హెల్మెట్ ప్రతి ఒక్కరు ధరించి ప్రయాణాలు సాగించడం మంచిదన్నారు. రోడ్డు ప్రమాదాలతో అనేకమంది ప్రాణాలను పోగొట్టుకునే పరిస్థితి నెలకొంటుంద న్నారు.యువత స్పీడు డ్రైవింగ్‌తో రోడ్డు ప్రమాదంలోనే అత్యధికంగా మరణించడం జరుగుతుందన్నారు. రోడ్డుకు ఇరువైపులా వెనుక ముందు చూసుకొని ప్రయాణం సాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ఐకెపి సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై పోరాటం : యుటిఎఫ్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తామని స్థానిక యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ నారాయణ, ఎస్.బాలకృష్ణ చెప్పారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో యుటిఎఫ్ మండల శాఖ కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉద్యోగులను ప్రభుత్వం అనేక విధాలుగా నయవంచన చేసిందన్నారు. సిపిఎస్‌ని వారం రోజుల్లో రద్దు చేస్తానని హామీనిచ్చి జిపిఎస్‌ను బలవంతంగా రుద్దుతుందన్నారు. దీంతో ఉద్యోగులు అనేక విధాలుగా నష్టపోతున్నారన్నారు. జిపిఎస్‌ని ఎప్పటికీ ఉద్యోగులు అంగీకరించరన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఎం.మోహన్, కే బాబ్జి, బి.శ్రావణ్ కుమార్, మల్లికార్జున్, మేఘనాథ్ పాల్గొన్నారు.

గిరిజనేతరుల హక్కు పత్రాలు రద్దు చేయాలని..

పనసలపాడు గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:గిరిజన వారసత్వ భూముల్లో గిరిజనేతరులకు ఇచ్చిన హక్కు పత్రాలు రద్దు చేయాలని, ఈ విషయమై రోలుగుంట తహసీల్దార్ పై చర్యలు తీసుకోవాలని రోలుగుంట మండలం పనసలపాడు గిరిజనులు నర్సీపట్నం ఆర్డిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, రోలుగుంట మండలం పనసలపాడు రెవెన్యూ పరిధిలో గిరిజన భగత తెగకు చెందిన ఆదివాసి గిరిజనులు జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తమకు వారసత్వంగా వస్తున్న జిరాయితి భూముల హక్కు పత్రాలు కలిగి ఉన్నామని, జగనన్న భూ రీసర్వేకు పలసలపాడు గిరిజన గ్రామాన్ని మొదటి విడతగా ఎంపిక చేసి డ్రోన్ సర్వే చేశారన్నారు. రెవిన్యూ అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కుమ్మక్కై గిరిజన జిరాయితి భూములు సర్వే నెంబర్ 8-1.6-9.6-1-4.3లో 15 ఎకరాలను గిరిజనేతరులైన మాజీ సర్పంచ్ తమటాపు సత్యం నాయుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు పేరు మీద జగనన్న భూహక్కు పత్రాలు ఇవ్వడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. గిరిజనేతరులకు హక్కుపత్రాలు ఇచ్చిన తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు కె గోవిందరావు, గెమ్మెల నూకినాయుడు, చిన్నబ్బాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

గడప గడపకు మన ప్రభుత్వంలో..

సమస్యలపై ఎమ్మెల్యేలకు మొర

నర్సీపట్నం టౌన్: పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. మున్సిపాలిటీలోని 19వ వార్డు కొత్త బయ్యపురెడ్డిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలో సిసి రోడ్డు, రెండు మంచినీటి బోర్లు కావాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. సీసీ రోడ్డుకు రూ.5 లక్షలు అక్కడికక్కడే ఎమ్మెల్యే మంజూరు చేశారు. రెండు మంచినీటి బోర్లు సాధ్యమైనంత తొందరగా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పట్టణ వైసీపీ అధ్యక్షుడు యాకా శివ, కౌన్సిలర్ శిరసపల్లి నాని, ఏఎంసీ వైస్ చైర్మన్ మళ్ల గణేష్, కార్పొరేషన్ డైరెక్టర్లు బషీరున్నీసా బేగం, అర్జున వెంకటరావు, కో ఆప్షన్ సభ్యులు భాషా, రోజా, సచివాలయాల కోఆర్డినేటర్ తమరాన శ్రీను, దాడి బుజ్జి పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి-కోటవురట్ల:సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడపగడపకు వైసిపి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.జగనన్న కాలనీ ఇల్లు వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని పలువురు కోరారు. పెట్రోల్ బంకు సమీపంలో కాలనీ నిర్మాణాలు పూర్తయినా తాగునీటి, వీధిలైట్లు, రోడ్ల సౌకర్యం లేక పోవడంతో ఇల్లు వృథాగా పడి ఉన్నాయని పలువురు తెలిపారు.పలు ప్రాంతాల్లో పారిశుద్యం పట్ల చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పథకాలు

అర్హులందరికీ పథకాలు : బూడి

ప్రజాశక్తి-మాడుగుల:అర్హులు అందరికీ నూటికి నూరు శాతం అన్ని పథకాలు అందే విధంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. శనివారం ముకుందపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సురక్ష పథకం అమలు చేసి కుల, మత, వర్గ, ప్రాంతీయ భేదాలు లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ప్రభుత్వానిదే అని అన్నారు. గ్రామంలో నెలకొన్న 100 ఎకరాల భూ సమస్యను పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో ఇప్పటి వరకు అమలు చేసిన 7 కోట్ల రూపాయల నిధులు వివరాలు తెలిపారు. గ్రామంలో పలు సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నేతలు పాల్గొన్నారు.

మాడుగుల:శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో భాగంగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు విత్తనాల పంపిణీ చేపట్టారు.ముకుంద పురం గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో వివిధ రకాల వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వాసుదేవరావు, అధికారులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న బూడి

స్పందన సమస్యలపై పరిష్కార వేదిక

ప్రజాశక్తి-కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదులపై శనివారం తహసీల్దార్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్ జానకమ్మ, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు నిర్వహించిన పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యలు, ఆక్షాహెబ్ పేట, రామచంద్రపాలెం, కోటవురట్ల, చిన్న బొడ్డేపల్లి గ్రామాల రెవెన్యూ సమస్యలతో కార్యాలయం హోరెత్తిపోయింది.

ఎవరి వాదనను వారి వినిపించడంతో అధికారులు పరిష్కరించేందుకు తలలు కొట్టుకుంటున్నారు. సమస్యల పరిష్కారం పట్ల ఫిర్యాదు దారులు సైతం అసహనం చేస్తున్నారు. ఇదిలా ఉండగా స్పందన సమస్యల పరిష్కారం సమయంలో మీడియాకు లోనికి అనుమతించకపోవడం పట్ల ఆంతర్యం ఏమిటని ఫిర్యాదుదారులు చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, ఈవోపీఆర్డి సుబ్రహ్మణ్యం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యాలయం ఆరుబయట పోలీసులకు వివరాలు చెబుతున్న ఫిర్యాదుదారులు